www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 30 మే 2023

ఐకేపీ వీఓఏల ముందస్తు అరెస్ట్

కాగజ్‌నగర్ : సమస్యల పరిష్కారం కోసం 45 రోజులుగా సమ్మె చేస్తున్న ఐకేపీ వీఓఏలను సోమవారం తెల్లవారుజామునే పోలీసులు అరెస్ట్ చేశారు. 45 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వీఓఏల సంఘం ఆధ్వర్యంలో ఛలో హైద్రాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమైన ఐకేపీ వీఓఏలను ముందస్తుగా అరెస్ట్ చేసి రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీనిని సీఐటీయూ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. అరెస్టులతో పోరాటాలు ఆగవని, రాబోయే రోజులలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.



జూన్ 1 నుంచి విద్యుత్ గుత్తేదారుల సమ్మె

హాజీపూర్ : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ గుత్తేదారులు జూన్ 1 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు జిల్లా విద్యుత్ గుత్తేదారుల సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ తెలిపారు. తాము చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని, డబ్బులు లేక చాలామంది గుత్తేదారులు అప్పుల పాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా నాన్ స్టాప్ బిల్లులను ఎస్ఎస్ఆర్ రేట్లు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, కార్యదర్శి నాగస్వామి, దేవేందర్, రాజేశం మిగతా కాంట్రాక్టర్‌లతో కలిసి జిల్లా విద్యుత్ శాఖ అధికారి శేషారావుకు వినతిపత్రం అందజేశారు.



విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



అంకుసాపూర్ గ్రామానికి చెందిన మహిళ సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. రూరల్ ఎస్ఐ సోనియా తెలిపిన ప్రకారం టాకిరె అమ్మబాయి(55) తన ఇంటి ముందు అల్లుకున్న చిక్కుడు తీగను తొలగించే క్రమంలో అందులోని విద్యుత్ సర్వీసు వైరును గమనించలేదు. చిక్కుడు తీగను కత్తితో కత్తిరిస్తూ అందులోని సర్వీసు వైరును కూడా కత్తిరించింది. దీనితో అమ్మబాయి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. అమ్మబాయి కుమారుడు మారుతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ గౌరీశంకర్, సర్పంచ్ జంగుపటేల్, ఉప సర్పంచ్ పెంటు, పంచాయతీ కార్యదర్శి రాంటెంకి సంధ్య ఘటనాస్థలాన్ని సందర్శించారు.

సింగరేణి కార్మికులకు బస్సు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి జీఎం కార్యాలయం సిబ్బందికి, గోలేటి గ్రామస్తులకు గోలేటి నుండి మంచిర్యాల వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రీజినల్ మేనేజర్ కె జానిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు, కార్మికేతరులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, వికలాంగులు, సింగరేణి కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ఉద్యోగానికి వచ్చి వెళ్లేటప్పుడు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు గల సెంట్రల్ నర్సరీలో శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న అన్ని గనులు, విభాగాల మహిళా ఉద్యోగినులకు సోమవారం పోటీలు నిర్వహించారు. టగ్ ఆఫ్ వార్, బాంబు బ్లాస్ట్, త్రో బాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మహిళలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన వారికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో బహుమతులను అందజేస్తారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిఓ ప్రకాష్ రావు, స్పోర్ట్స్ సూపర్వైజర్ చాట్ల అశోక్, ఫారెస్ట్ సూపర్వైజర్ పనాస రవీందర్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ తోట సురేష్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

భట్టుపెల్లి పంచాయతీ జీడిచేను గ్రామంలో సోమవారం సిర్పూరు పేపర్ మిల్లు, పర్యావరణ పరిరక్షణ కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా జమ చేసి ఇంటి ముందుకు వచ్చిన చెత్త బండికి అప్పగించాలని ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉమా నాందేవ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ పిర్సింగుల తిరుపతి, గ్రామ కార్యదర్శి వాజిద్, మిల్లు ప్రతినిధి తుమ్మ రమేష్, పర్యావరణ పరిరక్షణ కేంద్ర సంస్థ ప్రతినిధులు వినీల్, సుశీల పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభం

నవతెలంగాణ-దండేపల్లి

మండల కేంద్రంలో ఆర్టీసీ కార్గో పార్సిల్ సేవలను డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేంసాగర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నిర్వాకుడు భాను ప్రసాద్ మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7గంటల వరకు పార్సిల్‌లను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, ఆర్టీసీ కార్గో సిబ్బంది, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రత్నం ఆధ్వర్యంలో సోమవారం కాగజ్‌నగర్ ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు యువకులు హాజరై రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెండుగురె శ్యాంరావు, సర్పంచ్ సాయినాథ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని వినతి



నవతెలంగాణ-దండేపల్లి

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే అకాల వర్షాలతో రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లారీల కొరతతో కొనుగోలు చేసిన ధాన్యం కూడా వర్షం పడితే తడిసిపోయే పరిస్థితి ఉందన్నారు. లారీ ఓనర్లు మిల్లర్లతో కుమ్మక్కై రైతులను దగా చేసే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం తీసుకెళ్లిన లారీలు వారం రోజులుగా మిల్లుల ముందే ఉంటున్నాయన్నారు. ధాన్యం కొనుగోలులో వేగం పెంచి వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించాలి



నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్రం ఆవిర్భవించి 9సంవత్సరాలు పూర్తి చేసుకొని 10వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. సోమవారం సింగరేణి అతిథి గృహంలో దశాబ్ది ఉత్సవాల నిర్వహణ, జూన్ 9న సీఎం పర్యటన అంశాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి, ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యతో కలిసి జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ చైర్మన్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 2నుండి 22వ వరకు 21 రోజుల పాటు జిల్లాలో చేపట్టనున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు, జూన్ 9న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. రాష్ట్ర పురోగతి, ప్రగతి, సంక్షేమాన్ని చాటిచెప్పేలా ఘనంగా నిర్వహించాలని, తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో అద్భుతమైన ప్రగతి, పురోగతి సాధించడం జరిగిందని, రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశం దృష్టికి ఆకర్షిస్తుందని తెలిపారు. విజయ పథంలో కొనసాగుతున్న రాష్ట్రంలో చేపట్టిన ప్రజా సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల వివరాలు ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఖరీఫ్, రబీ సీజన్లలో అధికంగా వరిధాన్యం పండిస్తూ దేశంలో నంబర్.1గా నిలిచిందని, గ్రీన్ కవర్ పెంపొందించడంలో, ఆసరా పెన్షన్లు, రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ వంటి ప్రజా ఉపయోగకర పథకాల ద్వారా రైతుల అభ్యున్నతి, ప్రజల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు దశాబ్ది ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిలలో ప్రజాప్రతినిధులు ఉత్సవాలలో విధిగా పాల్గొనాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను జిల్లాలో విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, 21 రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలలో ప్రతి రోజు నిర్వహించవలసిన కార్యక్రమాలతో రూపొందించిన కార్యచరణ ప్రకారంగా ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందాన్ని అమలు చేయకుంటే పోరాటం



నవతెలంగాణ - మందమర్రి

వేతన ఒప్పందాన్ని అమలు చేయకుంటే పోరాటాలు తప్పవని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్ అన్నారు. కెకె ఓసీపీలో సోమవారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఫిట్ సెక్రటరీ మేడి రాజమల్లు అధ్యక్షతన సమావేశం జరిగింది. తాజాగా జరిగిన 16వ మహా సభల్లో రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికైన ఆరిఫ్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ బీజేపీ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వరంగ పరిశ్రమల్లో చేసుకున్న అగ్రిమెంట్ల కంటే బొగ్గు గని కార్మికులకు చేసుకున్న 11వ వేతన ఒప్పందం మెరుగైనదేనని అన్నారు. అగ్రిమెంట్‌ను కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం పంపడం జరిగిందని, అనుమతులు వచ్చిన వెంటనే అమలు జరుగుతుందని తెలిపారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోతే మళ్లీ అన్ని సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేయడానికి కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వేతన ఒప్పందంలో సంతకాలు చేసి బయటికి వచ్చి విమర్శించడం ఏ విధంగా సరైనదని విమర్శించే నాయకులను ప్రశ్నించారు. కార్మికులుగా మనం పోరాటం చేసి వేతన ఒప్పందాన్ని అగ్రిమెంట్ చేసుకుంటే అధికారులు కూడా తమకు వేతనాలు పెంపుదలకు అనుమతులకు పంపారని ఫలితంగా అధికారుల వేతనాలు సైతం పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో వేతన ఒప్పందాలు లేకుండా బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చిందని, అది అమలు అయితే ఏ ప్రభుత్వ రంగ సంస్థలో కూడా వేతన ఒప్పందాలు జరగవని పేర్కొన్నారు. అనంతరం కెకె ఓసీపీ సమస్యలను ప్రస్తావిస్తూ అనుక్షణం రక్షణ గురించి చెప్పే యాజమాన్యం రోడ్డుపై దుమ్ము ఉన్న కూడా వాటర్ స్ప్రేయింగ్ చేయడం లేదని, సిహెచ్‌పి వరకు కార్మికులను తీసుకెళ్లడమేకానీ షిఫ్ట్ అయిపోయాక తీసుకురావడం లేదని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు వెంకటస్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు అలవాల సంజీవ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ ఆరిఫ్, శ్రీనివాస్, శ్రీధర్ పలువురు కార్మికులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలపై సమీక్ష



నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను శ్రీరాంపూర్ ఏరియాలో ఘనంగా నిర్వహించాలని ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి అన్ని విభాగాల అధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ అన్ని గనులు విభాగాలలో ఉత్సవాల నిర్వహణ, శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో నిర్వహించే ఏరియా స్థాయి ఉత్సవాలు, సింగరేణి ప్రగతిని వివరిస్తూ ఫొటో ఎగ్జిబిషన్లు, బ్యానర్లు, అద్భుత ప్రగతి పుస్తకాల పంపిణీ ఇతర కార్యక్రమాల నిర్వహణపై అంశాల వారీగా సమీక్షించారు. 134 సంవత్సరాల చరిత్రలో సింగరేణి సంస్థ ఎన్నడూ సాధించని వృద్ధిని తెలంగాణ రాష్ట్ర అవతరణ జరిగిన తర్వాత నమోదు చేసిందని, ఉత్పత్తి, టర్నోవర్ లాభాలు అద్భుత ప్రగతిని నమోదు చేసిందని పేర్కొంటూ ఈ విజయాలను ఉద్యోగులకు, ప్రజలకు సింగరేణి సంబరాలలో పలు మాధ్యమాల ద్వారా వివరించాలన్నారు. అలాగే లఘు వీడియో చిత్రాన్ని ప్రదర్శించాలని, సంస్థ ప్రచురించిన సింగరేణి అద్భుత ప్రగతి పుస్తకాలను ప్రతి ఉద్యోగికి అందజేయాలని ఆదేశించారు. వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన ఉద్యోగులు తమ అభిప్రాయలను గని వేదికపై వెల్లడించేలా ఆహ్వానించాలని, ఉద్యోగులందరికీ స్వీట్ బాక్సులు పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం శ్రీనివాస్, డిజిఎం పర్సనల్ అరవింద రావు, డిజిఎం సివిల్ శివరావు, డిజిఎం ఏరియా వర్క్‌షాప్ చంద్రశేఖర్‌రెడ్డి, క్వాలిటీ మేనేజర్ కె వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, ఫారెస్ట్ ఆఫీసర్ రమణారెడ్డి, ఎస్ఈ వర్క్ షాప్ సతీష్ చక్రవర్తి, సీనియర్ పిఓ పి కాంతారావు, సీనియర్ ఐటి ప్రోగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు బహుమతులు, స్వీట్స్ ఇవ్వాలి

నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి కార్మికులకు ప్రత్యేక బహుమతులు, స్వీట్ ప్యాకెట్లు అందజేయాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్‌ను కలిసి కోరారు. సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్‌రావు, 11 మేన్ కమిటీ మెంబర్ దరావత్ మంగీలాల్‌తో కలిసి ఆయన జీఎంతో చర్చించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఖైరిగూడ, సీహెచ్‌పీ నుండి మాత్రమే కాకుండా ఏరియాలోని మిగతా డిపార్టమెంట్లు ఏరియా వర్క్‌షాప్, అబ్బాపూర్ ఓపెన్‌కాస్ట్, ఏరియా స్టోర్, సివిల్ డిపార్టుమెంట్, ఏరియా ఆస్పత్రి, సెక్యూరిటీ డిపార్టుమెంట్ల నుండి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఒక్కొక్కరికి సన్మాన కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా కార్మికులకు సన్మాన పత్రాలు అందజేయాలని కోరారు.


అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

- అరగంటలోపే ముగిసిన సమావేశం



బెజ్జూర్ : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ రోజా రమణి అన్నారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం అరగంటలోపే ముగిసింది. ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంతో సర్వసభ్య సమావేశం నామమాత్రంగా కొనసాగింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశాలు నామమాత్రంగా నిర్వహించి సమావేశాలు జరిగినట్టు రాసుకుంటున్నారు తప్ప ఎలాంటి ప్రయోజనం లేదు. ప్రతి మూడు నెలలకు నిర్వహించే సర్వసభ్య సమావేశాల్లో ప్రజా సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించాల్సి ఉండగా పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. సమావేశంలో జడ్పీటీసీ పుష్పలత, ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ పృథ్వీరాజ్, ఏఈ అభిలాష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణ, ఏపీఎం భద్రయ్య, ఏపీఓ చంద్రయ్య పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలి



ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో పేద మహిళలతో కలిసి సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది పేదలు ఇండ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు డబుల్ బెడ్ రూమ్ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కలెక్టర్ కార్యాలయంలో ఇల్లు కావాలని దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్ మంజూరు చేయాలన్నారు. సొంత స్థలం ఉన్న పేదలకు గృహలక్ష్మి పథకంలో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. పేదలకు అండగా ఉండి పోరాడుతామన్నారు. ధర్నాలో మహిళలు కమలబాయి, సండే శోభ, చిన్నబాయి, తానుబాయి, శాంతాబాయి, సండే మమత పాల్గొన్నారు.

రైతులందరికీ వ్యవసాయ కనెక్షన్లు ఇస్తాం



నవతెలంగాణ - కౌటాల

రైతులందరికి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని టీఎస్ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ గణపతి అన్నారు. మండలంలోని తాటిపెల్లి గ్రామంలోని రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో సోమవారం విద్యుత్ అధికారులు తాటిపెల్లి గ్రామానికి వెళ్లి రైతులందరికి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని, కావాల్సిన రైతులు డీడీలు కట్టి విద్యుత్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. గతంలో డీడీలు కట్టిన రైతులకు విద్యుత్ కనెక్షన్ల పనులను పరిశీలించారు. విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, సంస్థ సీఎండీ గోపాల్‌రావు ఆదేశాల మేరకు తాటిపెల్లిలో పర్యటించినట్టు పేర్కొన్నారు. అక్కడి రైతులతో మాట్లాడి విద్యుత్ శాఖ తరపున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని రైతులకు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన కరెంటు నిరంతరం ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రైతుల కోసం అహర్నిశలు పాటుపడుతున్నందుకు ఆయనను అభినందించారు. ఇందులో భాగంగా 15 రోజులుగా యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు ప్రక్రియను వేగవంతం చేసినట్టు తెలిపారు. వచ్చే నెల మొదటి వారంలోనే రాష్ట్ర మంత్రులు, సీఎండీ తాటిపెల్లికి వస్తున్నారని తెలిపారు. వచ్చే నెల రెండో తేదీన అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్ఈ వాసుదేవ్, డీఈ నాగరాజు, రాజశేఖర్, ఏడీఈ రాజేశ్వర్, ఏఈలు రవీందర్, శ్రీనివాస్ ఉన్నారు.

కార్మికుల మద్దతుతో మెరుగైన వేతన ఒప్పందం



నవతెలంగాణ-నస్పూర్

కార్మికుల మద్దతుతోనే 11వ మెరుగైన వేతన ఒప్పందం జరిగిందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. బ్రాంచ్ కార్యదర్శి మిడిల్ శంకర్ ఆధ్వర్యంలో ఆర్కే7 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 11వ వేతన ఒప్పందంను బిజెపి ప్రభుత్వ అనుమతుల కోసం పంపారని, అనుమతులు రాగానే అమలు అవుతాయని పేర్కొన్నారు. ఒకవేళ అనుమతులు కేంద్ర ప్రభుత్వం ఇవ్వకపోతే పోరాటాలకు కార్మికులందరూ సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతులు బిజెపి ప్రభుత్వాన్ని మెడలు వంచి రైతు చట్టాలను వెనక్కి తీసుకునేలా చేస్తే బొగ్గు గని కార్మికులు ఆందోళనలతో మెరుగైన వేతన ఒప్పందాన్ని చేసుకోవడం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేరైనా కార్మికుల పట్ల అవలంబిస్తున్న విధానాలు ఒకటేనని అన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మికులకు హక్కులు లేకుండా చట్టాలు మారుస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం అన్ని యూనియన్లు కలిపి చేసుకున్న ఆర్ఎల్సీ అగ్రిమెంట్లను అమలు చేయడం లేదని విమర్శించారు. ఎవరెన్ని విమర్శలు చేసినా ఇతర సంస్థలలో కంటే మెరుగైన వేతన ఒప్పందం చేసుకున్నామని, దీని వల్ల పెరుగుదలతో పాటు అలవెన్స్ సైతం పెంచుకోవడం జరిగిందని తెలిపారు. వేతన ఒప్పందం వల్ల కార్మికులకు ఇన్కమ్ టాక్స్ ఎక్కువగా పడే అవకాశం ఉన్నందున అలవెన్స్‌పై ఐటి మాఫీ చేయాలన్న 2011లో చేసిన అగ్రిమెంట్ కార్మికులకు అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని ఆదేశించాలని, లేదంటే సింగరేణి ఎన్నికలలో ఓట్ల కోసం వచ్చే నాయకులను ప్రశ్నించాలని తెలిపారు. అదేవిధంగా గతంలో సీఎం చెప్పినట్లు సొంతింటి పథకం అమలుపై కూడా ప్రశ్నించాలని కార్మికులకు తెలియజేశారు. యూనియన్లకు అతీతంగా కార్మికులు కలిసి ఎన్నికలలోపే అలవెన్స్‌పై ఐటి మాఫీ, సొంతింటి కలను నెరవేర్చుకోవడం కోసం సీఐటీయూ చేపట్టే పోరాటాల్లో భాగస్వామ్యమై సాధించుకోవాలని కోరారు. ఈ సమావేశానికి బ్రాంచ్ ఉపాధ్యక్షులు గుల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కస్తూరి చంద్రశేఖర్, డివిజన్ నాయకులు వెంగళ శ్రీనివాస్, బోడకుంట శంకర్, అశోక్, సదానందం, ఆర్కే7 ఫిట్ సెక్రెటరీ శ్రీధర్, సమ్మయ్య, యాదగిరి, గంగాధరచారి పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షా కేంద్రానికి స్పందన



నవతెలంగాణ- కాసిపేట

మండలంలోని దేవాపూర్‌లో గొంది సరోజమ్మ, బుచ్చన్న స్మారకార్థం కుమారుడు గొంది వెంకటరమణ లయన్స్ విజన్ ఉచిత కంటి పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయగా సోమవారం దాత, నిర్వాహకులు గొంది వెంకటరమణ ప్రారంభించారు. ఉచిత కంటి పరీక్షా కేంద్రంలో మొదటి రోజు నిర్వహించిన కంటి వైద్య పరీక్షల్లో 70 మందికి కంటి సమస్యలపై వైద్యులు పరీక్షలు చేశారు. వారిలో 16 మందికి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు గుర్తించారు. 20 మందికి కంటి అద్దాలు అవసమని తేలింది. ముగ్గురికి తీవ్రమైన సమస్య ఉన్నట్లు గుర్తించారు. ఉచితంగా శాశ్వత కంటి పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, ఆపరేషన్లు, అద్దాలు అందించే కార్యక్రమాన్ని చేపట్టిన దాత గొంది వెంకటరమణను స్థానిక నాయకులు, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ హర్షితారెడ్డి, డాక్టర్ దత్తగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, నాయకులు వడ్లూరి మల్లేశ్, గడ్డం పురుషోత్తం, మచ్చ అనీల్, కట్కూరి సత్యనారాయణ, ఎస్పీ శర్మ బొల్లు దాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-జన్నారం

ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆర్ఐ భానుచందర్, పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ధర్మారం తండాకు చెందిన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు భానుచందర్ తెలిపారు. ఇసుక అవసరం ఉన్నవారు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించి తహసీల్దార్ అనుమతితో చట్ట ప్రకారం ఇసుకను తీసుకోవాలన్నారు. అక్రమంగా తరలిస్తే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
మంగళవారం 30 మే 2023

కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కడెం



కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నచ్చన్ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న అన్నారు. సోమవారం గ్రామపంచాయతీ పరిధిలోని పెత్తర్పులో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కంటివెలుగు శిబిరాన్ని ప్రతిగ్రామంలో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సూపర్వైజర్ గోపాల్, ఏఎన్ఎం, ఆశవర్కర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమీకృత కలెక్టరేట్ పరిశీలన

నవతెలంగాణ-నిర్మల్



సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సమీకృత కలెక్టర్ కార్యాలయాల సముదాయాన్ని సోమవారం పరిశీలించారు. సీఎం పర్యటన సమయానికి కలెక్టరేట్ భవనాన్ని పూర్తి హంగులతో అలంకరించాలని అధికారులకు సూచించారు. జూన్-2లోగా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు విఠల్రెడ్డి, రేఖా శ్యాంనాయక్, ఆర్ అండ్ బీ శాఖ ఈఎన్సీ గణపతిరెడ్డి, కలెక్టర్ వరుణ్ రెడ్డి, అధికారులు ఉన్నారు.

ధాన్యాన్ని రైస్మిల్లులకు తరలించాలని రైతుల ధర్నా



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని జామ్, చించోలీ(బి) గ్రామాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని రైస్మిల్లులకు తరలించాలని నిర్మల్, స్వర్ణ రహదారిపై ధర్నా చేపట్టి, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎలాంటి తరుగు లేకుండా కొనుగోలు చేయలని డిమాండ్ చేశారు. రైతులకు మద్దతుగా బీజేపీ నాయకుడు ఏలేటి మహేశ్వర్రెడ్డి ధర్నాలో పాల్గొని, రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్వర్రెడ్డి మాట్లాడారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అన్నారు. వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డితో ఫోన్లో మాట్లాడారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల నాయకులు విలాస్, రామ్ శంకర్రెడ్డి, వీరయ్య, తిరుమలచారి, మధుతో పాటు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్టౌన్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనమడు అడ్వొకేట్ ప్రకాష్ అంబేద్కర్ ముఖ్యఅతిథిగా పాల్గొనే సభను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాల బహుజనలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్ హౌస్లో బహుజన నాయకులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ 6వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని రామ్లీలా మైదానంలో గొప్ప బహిరంగ సభను ఏర్పాటు చేశామని అన్నారు. బహుజన కులాలకు సామాజిక న్యాయంతో పాటు రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రకాష్ అంబేద్కర్ సభను బహుజన కుల సంఘాల వాళ్లంతా కలిసి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సందీప్ దండగే, నాగసేన్ మాన్కర్, ప్రజ్ఞ కుమార్ రత్నజాడే, సురేందర్ లాండగే, అనిల్ సాల్వే, గంగారాం బోరెకర్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

నవతెలంగాణ-నిర్మల్

బీసీ కులవృత్తుల వారికి రాష్ట్రప్రభుత్వం రూ.లక్ష పూర్తి సబ్సిడీ రుణాలను ప్రకటించిన నేపథ్యంలో రుణాలను ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మి మోసపోవద్దని నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంబడి. చంద్రశేఖర్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. అలాంటి వారు ఎవరైనా ఉంటే బీసీ సంక్షేమ సంఘం దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. తమ దృష్టికి తెస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఏమైనా అనుమానాలు ఉంటే అధికారులను కలిసి నివృత్తి చేసుకోవాలని కోరారు.

తహసీల్దార్ ఎదుట ఇద్దరి బైండోవర్



నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని సత్తెనపల్లి సేవ్యా నాయక్ తండకు ఇద్దరూ మహిళలను సోమవారం తహసీల్దార్ రాజమోహన్ ఎదుట ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ బైండ్ ఓవర్ చేశారు. అక్రమంగా గుడుంబాను తయారుచేసి అమ్ముతున్న ఇద్దరు మహిళలతో పాటు పది లీటర్ల నిషేధిత గుడుంబాను పట్టుకున్నారు. మళ్లీ ఇలాంటి నేరం చేయకుండా సత్ప్రవర్తన కలిగి ఉండేందుకు ఖానాపూర్ తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 110 కింద బైండోవర్ చేసినట్లు నిర్మల్ స్టేషన్ ఎక్సైజ్ ఎస్సై తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-ముథోల్



మండలంలోని గన్నోర గ్రామంలోని శివాలయంలో విగ్రహప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ఉదయం శివ పంచాయతన, నవగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహించారు. ఈ మహోత్సవంలో భాగంగా నూతనంగా నిర్మించిన శివాలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే ఆంజనేయ మందిర వద్ద నవగ్రహ దేవత ప్రతిష్టాపన చేశారు. గ్రామస్తులు కలిసి మెలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించటం అభినందనీయమని నాయకులు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విఠల్రెడ్డి, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, కాంగ్రెస్ నాయకులు ఆనంద్రావ్ పటేల్, బీజేపీ నాయకులు మోహన్రావు పటేల్లు నూతన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి గ్రామ వీడీసీ సభ్యులు ఘనంగా సన్మానించారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సురేందర్రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మి నారాయణ, సర్పంచ్ లావణ్య కిష్టయ్య, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, వీడీసీ సభ్యులు గంగారెడ్డి, దశరథ్, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని, అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై మంత్రి జిల్లా అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామాలు, నియోజకవర్గాలు, జిల్లా వారిగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. ప్రజాప్రతినిధులందరూ సమన్వయం చేసుకుంటూ దశాబ్ది ఉత్సవాలను వేడుకగా నిర్వహించి, విజయవంతం చేయాలని సూచించారు. 21 రోజుల పాటు రాష్ట్రం సాధించిన విజయాలను ప్రజలకు తెలిపేలా దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని అన్నారు. రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలు ఊరు వాడలా జరగాలని, ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్గా తీసుకుని, ఆయా గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ గ్రామాన సభలు పెట్టాలని అన్నారు. ఆయా గ్రామ సభల సందర్భంగా ప్రగతి నివేదికలు చదివి ప్రజలకు వినిపించాలని అన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిని, సాధించిన విజయాలను ప్రజలు తెలిపేలా ప్రదర్శనలు జరగాలని అన్నారు. సమావేశంలో ముథోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు విఠల్రెడ్డి, రేఖ నాయక్, కలెక్టర్ వరుణ్రెడ్డి, ఎస్పీ ప్రవీణ్ కుమార్, ఆదనపు కలెక్టర్ రాంబాబు, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రాణాలకు ముప్పు కలిగించే ఫ్యాక్టరీని అడ్డుకుంటాం

- పరిశ్రమ పనులు నిలిపివేయాలని డిమాండ్
- ఇథనాల్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు

నవతెలంగాణ-దిలావర్పూర్

జీవరాశికి ముప్పు కలిగించే లిక్కర్ ఫ్యాక్టరీని అడ్డుకుంటామని దిలావర్పూ, గుండంపల్లి గ్రామస్తులు పేర్కొన్నారు. సోమవారం జీవరాశికి ముప్పు కలిగించే ఫ్యాక్టరీ పనులను నిలిపివేయాలని తహసీల్దార్కు వినతిపత్రాన్ని అందజేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం కేటాయించిన స్థలంలో పనులు ప్రారంభమవుతున్నాయని తెలుసుకున్న రైతులు, నాయకులు తరలివెళ్లి ఫ్యాక్టరీ పనులను అడ్డుకున్నారు. ఫ్యాక్టరీని స్థాపించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని రైతులు పేర్కొన్నారు. దగ్గరలో ఉన్న గోదావరి నదీ జలాలలో ఫ్యాక్టరీ వ్యర్థపు నీరు చేరి స్వచ్ఛమైన గోదావరి జలం కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ పరిసర గ్రామాలైన దిలావర్పూర్, గుండంపల్లి, బన్సపల్లి గ్రామాలలో ఫ్యాక్టరీ నుంచి వెదజల్లే కలుషిత వాయువు వల్ల పరిసర ప్రాంతాల్లోని మనుషులు, పశువుకు ఆరోగ్య సమస్యలు వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాల్దె అక్షరా అనిల్, మాజీ ఎంపీపీ పాల్దె శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేవేందర్రెడ్డి, ఎఫ్ఎస్సీఎస్ డైరెక్టర్ దుప్పి సాయన్న, రైతులు నడుకుడ పోశెట్టి, నామాయి సాయన్న, పసుల పవన్, కుంట గంగాధర్, ముస్కు నర్సారెడ్డి, గుణవంత్రావు, కోడె శ్రీనివాస్, కోడె నవీన్, సప్పల రవి, పీసరి విలాస్, కప్పకంటి అనిల్, చిట్టి సుభాష్, సప్పల నర్సయ్య, చిట్టి ముత్యం పాల్గొన్నారు.



పండుగ వాతావరణంలో దశాబ్ది వేడుకలు నిర్వహించాలి



నవతెలంగాణ-నిర్మల్

పండుగ వాతావరణంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు నిర్వహించాలని సీఎస్ శాంతికుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జూన్ 2 నుంచి జూన్ 22 వరకు రాష్ట్ర దశాబ్ది వేడుకలు మన ప్రగతి చాటేలా ఘనంగా నిర్వహించాలని అన్నారు. రైతు దినోత్సవం, ఊరురా చెరువుల పండుగ నిర్వహణ పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. రైతు దినోత్సవం రోజున జిల్లాలోని రైతు వేదికల్లో వేడుకలు జరగాలని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి రైతులను డప్పులతో ఘనంగా పండుగ వాతావరణంలో రైతు వేదికలకు తీసుకొని రావాలని తెలిపారు. అక్కడ ప్రభుత్వం ప్రతి రైతుకు కల్పించిన సౌకర్యాలు, అందించిన సాయం వివరించాలని అన్నారు. భోజన ఏర్పాట్లు చేయాలని అన్నారు. జూన్ 8న ఊరురా చెరువుల పండుగ సందర్భంగా గ్రామాల్లో ఉన్న పెద్ద చెరువు వద్ద బతుకమ్మ, బోనాలతో సాంస్కృతిక కార్యక్రమాలు, కట్ట మైసమ్మ పూజ, భోజనాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రైతు దినోత్సవం, ఊరురా చెరువుల పండుగ నిర్వహణకు జిల్లాలో అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని అన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కోరారు. విద్యుత్ రంగంలో గత పరిస్థితి, నేడు సాధించిన ప్రగతి తెలియజేస్తూ నాడు నేడు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో సురక్షా దివస్, తెలంగాణ రన్ నిర్వహించాలని అన్నారు.

వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం కలెక్టర్ వరుణ్రెడ్డి

జూన్ 2న ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలో వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని కలెక్టర్ వరుణ్రెడ్డి అన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రతిరోజు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడానికి గ్రామస్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి, ఇప్పటికే సమీక్ష సమావేశాలు నిర్వహించామని అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి కార్యక్రమాల నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలో అన్ని శాఖల ద్వారా సాధించిన ప్రగతి వివరించేలా పకడ్బందీగా దశాబ్ది వేడుకలను నిర్వహిస్తామని అన్నారు. ఇందులో ఎస్పీ ప్రవీణ్ కుమార్, అదనపు కలెక్టర్ రాంబాబు, అటవీ శాఖ అధికారి సునీల్, డీఆర్వో లోకేష్, ఆర్డీఓ స్రవంతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు గుదిబండగా మారిన సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్రావ్ అన్నారు. టీపీటీఎఫ్ అవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక ప్రెస్ భవన్లో సోమవారం నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆత్రం భుజంగరావు మాట్లాడుతూ ఉపాధ్యాయల సమస్యల పరిష్కారం కోసం, సామాజిక సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక ఉపాధ్యాయ సంఘం టీపీటీఎఫ్ అని పేర్కొన్నారు. కోర్టులో ఉన్న న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి తక్షణమే బదిలీలు, పదోన్నతులు కల్పించి విద్యారంగాన్ని ఆదుకోవాలని అన్నారు. సీపీఎస్ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు. పెండింగ్లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం సుగుణ, నాయకులు శ్యామ్రావు, జ్ఞానేశ్వర్, గేడం గంగాసాగర్, సుంగు ఉన్నారు.



బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ను కఠినంగా శిక్షించాలి

- పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల లక్ష్మి డిమాండ్



నవతెలంగాణ-నిర్మల్

రెజ్లింగ్ క్రీడాకారిణిలపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ను తక్షణమే బాధ్యతల నుంచి తొలగించి, చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళ సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కట్ల లక్ష్మి మాట్లాడారు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా కొనసాగుతున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్పై గతంలోనే అనేక కేసులు, ఫిర్యాదులు ఉన్నాయని అన్నారు. క్రీడాకారులపై బహిరంగంగానే వివాదాస్పదంగా ప్రవర్తించిన ఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం బ్రిజ్ భూషణ్ను వెనుకేసుకు రావడం ఫలితంగానే మహిళా క్రీడాకారులపై అతని ఆగడాలు మరింత తీవ్రమయ్యాయని అన్నారు. రెజ్లింగ్ క్రీడాకారులు ఒలింపిక్స్, ప్రపంచ కప్ మొదలైన పోటీల్లో దేశానికి పతకాలు తీసుకొచ్చినప్పుడు తమ ప్రభుత్వ గొప్పగా చెప్పుకొని, క్రీడాకారులతో ఫొటోలు దిగిన ప్రధాని, క్రీడా మంత్రి ఇప్పుడు మొహం చాటేయడం అనైతికమని అన్నారు. మహిళా క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ను తక్షణమే సమాఖ్య బాధ్యతల నుంచి తొలగించాలని, అతన్ని చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మ, కవిత, రాజమణి, పుష్ప, గంగామణి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కొట్నాక్ జంగుబాయి సోమవారం మరణించింది. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేణుకా సిమెంట్స్ ఫ్యాక్టరీ కోసం జంగు బాయి భూముల్ని తీసుకుని, ఆమె కుమారుడు చిత్రుకి ఉద్యోగం ఇస్తామని చెప్పి 3 నెలల పాటు పనిచేయించుకున్నారని, ఆ తరువాత పనిలో నుండి తొలగించారని అన్నారు. స్థానిక నాయకులు వేరేవారికి ఉద్యోగం ఇచ్చారనీ, కుటుంబ సభ్యుల ఆరోపణ. అలాగే గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఉద్యమంలో ఆమె కోడళ్లను అరెస్ట్ చేయడంతో మనస్తాపంతో మరణించిందని అన్నారు. అనంతరం మల్యాపూర్ చెరువు కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చిన మాలే బోరిగాం గ్రామానికి చెందిన గిరిజన రైతులతో కలిసి ప్రజావాణిలో అదనపు కలెక్టర్ నటరాజన్కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెరువు నిర్మాణం కోసం భూములు కోల్పోయిన వారు ఇప్పుడు కూలీలుగా మారారని అన్నారు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పరిహారం అందలేదని తెలిపారు.

అరెస్టులతో నిరసనలు ఆపలేరు



నవతెలంగాణ-దిలావర్పూర్

హైదరాబాద్లో తలపెట్టిన వీఓఏల నిరసన కార్యక్రమానికి తరలివెళ్తున్న ఐకేపీ వీఓఏలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. గత 45 రోజులుగా ఐకేపీ వీఓఏలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రభుత్వం స్పందించక పోవడంతో సోమవారం హైదరాబాద్లోని ఇందిరా పార్క్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆ నిరసన కార్యక్రమంలో పాల్గొనడానికి నిర్మల్ జిల్లా నుండి బయలుదేరిన వీఓఏలను అక్రమంగా అరెస్ట్ చేసి నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్కు వెళ్లి వీఓఏలకు మద్దతు తెలిపి, వారిలో మనో ధైర్యాన్ని నింపారు. స్థానిక ఎస్సై రవీందర్ చర్చించి వీఓఏలను విడిపించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని న్యాయపోరాటం చేస్తున్న వీఓఏలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్రెడ్డి, ప్రముఖ న్యాయవాది మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు పండించిన జొన్నలను పూర్తిగా కొంటాం : బాపురావు



నవతెలంగాణ-తాంసి

వేసవి కాలంలో రైతులు పండించిన జొన్నలను ప్రభుత్వం మద్దతు ధరతో పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డితో కలిసి జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మొదటగా రైతును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు మద్దతుగా నిలిచి రైతులు పండించిన ప్రతి పంటకు, మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అన్నారు. జొన్నలకు క్వింటాలకు రూ.2వేల 970ల మద్దతు ధర కల్పించి, కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. రైతులు ఆందోళన చెందకుండా గ్రామాల వారిగా మార్కెట్కు తీసుకువచ్చి విక్రయించుకోవాలని అన్నారు. జామిడి గ్రామానికి చెందిన రైతులు తమ పంటల ఆన్లైన్ నమోదు కాలేదని జొన్నలు విక్రయించుకోవడానికి అనుమతి కల్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి జొన్నలను కొనుగోలు చేసే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీ సీఈఓ కేశవ్, మండల వ్యవసాయ అధికారి రవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ ధనుంజయ్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ గోవర్ధన్రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ అరుణ్ కుమార్, నాయకులు మహేందర్, రఘు పలువురు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

పీఆర్సీ కమిటీ నివేదిక ప్రకారం పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.19వేలు చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్, ఐఎఫ్టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. గంగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ వర్కర్స్ రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం గ్రామపంచాయతి వర్కర్లతో కలిసి ఎంపీడీఓ శేఖర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పని చేస్తూ, కుటుంబ పోషణ భారమై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తుంటే, వేతనాలు పెంచకుండా దశాబ్ది ఉత్సవాల్లో పారిశుధ్య కార్మికులను సఫాయన్నా నీకు సలాం అన్నా అని గౌరవించాలని అన్నారు. ఉత్తమ పారిశుధ్య కార్మికులను సన్మానించాలని ముఖ్యమంత్రి ప్రకటిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ను ఏర్పాటు చేయాలని అన్నారు. దాని నుండే గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలని అన్నారు. 2011 జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రస్తుత జనాభా ప్రాతిపదికన గ్రామపంచాయతీ కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. ఉచిత ఆరోగ్య సదుపాయాలు, భీమా సౌకర్యం కల్పించి, ఆదుకోవాలని అన్నారు.

కన్నుల పండువగా మహాలక్ష్మికి పూజలు

నవతెలంగాణ-తాంసి

మండలంలోని పొన్నారి గ్రామంలో సోమవారం కన్నుల పండువగా శ్రీమహాలక్ష్మి ఆలయంలో ఐదవ వార్షికోత్సవాన్ని చేపట్టారు. వేకువ జామున అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి, అమ్మవారికి పిండివంటలతో నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కన్నాజి నర్సింగ్చారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు విఠల్, లక్ష్మీనారాయణ, స్వామి, గంగన్న, గణేష్, చిట్టి పాల్గొన్నారు.

సింగరేణి సంబరాలు విజవంతం చేయాలి

నవతెలంగాణ - మందమర్రి

జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, జూన్ 5న సింగరేణి సంబరాలను పురస్కరించుకొని మందమరి ఏరియా సేవా అధ్యక్షురాలు జి యశోద మోహన్‌రెడ్డి మహిళలకు ఆటలు, పాటలు, బృంద నృత్యాల పోటీలను ఎల్లెందు క్లబ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గెలుపొందిన మహిళలకు 5న సింగరేణి సంబరాలు కార్యక్రమంలో బహుమతులను అందజేస్తారని తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సింగరేణి సంబరాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైపిఎం మైత్రే బందు, లేడీస్ క్లబ్ సభ్యులు, మహిళలు సేవాసభ్యులు, ఫ్యాకల్టీస్, సేవా, కమ్యూనికేషన్, గ్రౌండ్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సోమగూడెంలో మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ - కాసిపేట



సోమగూడెం భరత్ కాలనీ చౌరస్తాలో నేదునూరి అనిల్‌కుమార్ జ్ఞాపకార్థం తన స్నేహితులు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు ఓరం కవిరాజ్, బెంబడి మహేశ్, తాళ్లపల్లి మహేశ్, అంజి, రాకేశ్, సాయి పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే : ఎస్సై రవికుమార్



నవతెలంగాణ-నస్పూర్

ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని సీసీసీ-నస్పూర్ ఎస్సై రవికుమార్ అన్నారు. నస్పూర్ కాలనీలోని శ్రీరామ కళ్యాణ మండపంలో జెన్ షిటో రియో కరాటే స్కూల్ ఆధ్వర్యంలో గ్రౌండ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ రవికుమార్ హాజరై మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు చిన్నప్పటినుండి కరాటే నేర్చుకోవడం చాలా అవసరమని తెలిపారు. స్వీయ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే తప్పక నేర్చుకోవాలని, దానికి తల్లిదండ్రులు ప్రోత్సాహం ఉండాలని పేర్కొన్నారు. అంతేకాకుండా క్రీడాకారులు ప్రదర్శించినటువంటి ప్రదర్శనలు చూసి ఆయన అభినందించారు. కార్యక్రమంలో జెన్ షిటో రియో చీఫ్ ఆవుల రాజనర్స్, మాస్టర్ పోచంపల్లి వెంకటేష్, హ్యాండ్ బాల్ ఆదిలాబాద్ జిల్లా సెక్రటరీ కనపర్తి రమేష్, మదర్స్ ప్రైడ్ స్కూల్ కృష్ణారెడ్డి, ట్రాస్మా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్, అంబాల రాజ్‌కుమార్, సీనియర్ మాస్టర్ రంగా రమేష్, జిల్లా జనరల్ సెక్రటరీ శివ, మహేష్, నరేష్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన



నవతెలంగాణ - కాసిపేట

ప్రమాదాల నివారణ ప్రత్యేక అవగాహన అంశంపై సింగరేణి వ్యాప్తంగా ప్రత్యేక చర్యలు ముందస్తుగానే పసి గట్టి నివారించాలని రీజినల్ సేఫ్టీ జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం కాసిపేట గనిపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ 8 సంవత్సర కాలం నుండి పరిశీలిస్తే ప్రమాదాలు ఎక్కువగా జూన్ మాసంలోనే జరుగుతున్నాయని, వచ్చే జూన్‌లో ప్రమాదాలు రాకుండా నివారించేందుకు అన్ని రకాల చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాలు అనుకోకుండా సంభవించినప్పుడు వాటిపై సమీక్ష చేసి నివారించేందుకు తగిన చర్యలు తీసుకుంటూనే, అసలు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడమే ఉత్తమమని అన్నారు. రక్షణతో ప్రమాదాలను నివారించి ఈ వార్షిక సంవత్సరంలో 75మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ అల్లావుద్దీన్, గ్రూపు ఏజెంట్ కుర్మ రాజేందర్, సంక్షేమ అధికారి మీర్జా గౌస్, ఏఐటియూసి, టిబిజికెఎస్ పిట్ సెక్రటరీలు మీనుగు లక్ష్మీ నారాయణ. అబ్దుల్లా, రక్షణ అధికారి సునీల్, ఇంజనీర్లు బాబు, మధుకర్, డిప్యూటి మేనేజర్ వెంకటేష్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బాను, నిఖిల్ పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ - మందమర్రి

సింగరేణి సంస్థలో మండలంలోని సారంగపల్లిలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మందమర్రి ఏరియా కేకే గ్రూప్ ఏజెంట్ రాందాస్ ముఖ్యాతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ సోషల్ వెల్ఫేర్ యాక్టివిటీలో భాగంగా ఈరోజు సారంగపల్లి గ్రామంలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ వైద్య శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్ వంటి వాటికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తామన్నారు. ఈ సదవకాశాన్ని గ్రామస్తులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెకె గ్రూప్ ఏజెంట్ రాందాస్, డాక్టర్ పి జనార్ధన్, సింగరేణి మెడికల్ క్యాంపు సిబ్బంది, సర్పంచ్, గ్రామ ప్రజలు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల హక్కులు ఏఐటీయూసీతోనే సాధ్యం

నవతెలంగాణ-నస్పూర్

కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన ఏఐటీయూసీతో మాత్రమే సాధ్యమని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ముస్కె సమ్మయ్య, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ అన్నారు. సోమవారం సివిల్ డిపార్ట్మెంట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సింగరేణిలో కాంట్రాక్ట్ వర్కర్స్ అనుభవిస్తున్న, ఇప్పుడున్న కనీస హక్కులు ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే సాధ్యమైందని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులు బ్యాంకుల ద్వారా జీతాలు, సిఎంపిఎఫ్ తదితర మౌలిక సదుపాయాల సాధనలో ఏఐటీయూసీ కార్మికుల పక్షాన నిలబడి హక్కులు సాధించిందని, అదేవిధంగా మే19, 20వ తేదీలలో జరిగిన 11వ వేజ్ బోర్డులో జాతీయ సంఘాలతో పాటు ఏఐటియుసి కీలకమైన పాత్ర పోషించడం వల్ల మెరుగైన వేజ్ బోర్డ్ సాధించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. అందులో భాగంగానే కాంట్రాక్టు కార్మికులకు కూడా కోలిండియాలో చెల్లిస్తున్నటువంటి హైపవర్ కమిటీ వేతనాలను సింగరేణిలో కూడా అమలు చేయాలని కాంట్రాక్ట్ కార్మికులకు కూడా కార్మిక చట్టాలను యాజమాన్యమే అమలు చేయాలని, బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లించాలని తదితర మౌలిక సదుపాయాల అగ్రిమెంట్లు ఏఐటీయూసీ చొరవతోనే పొందుపరచడం జరిగిందని పేర్కొన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్వహించే ప్రజాగర్జనకు కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి దొడ్డిపట్ల రవీందర్, శ్రీరాంపూర్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి గునిగంటి నర్సింగ్ రావు, రీజియన్ నాయకులు రాజు, ప్రభాకర్, సమ్మయ్య, తిరుపతి పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రాష్ట్రం ఆవిర్భవించి పదవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేయతలపెట్టిన దశాబ్ది ఉత్సవాలను జిల్లాలో వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వడ్డేపల్లి గార్డెన్ లో ప్రజా ప్రతినిధులు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో వైభవోపేతంగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. జూన్ 2 నుండి 22వ తేదీ వరకు 21 రోజుల పాటు వేడుకలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు కోనేరు కోనప్ప మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షను చాటేలా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసిందని అధికారులు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయడానికి కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయి, ఎస్‌పి సురేష్ కుమార్, ఆర్డిఓ రాజేశ్వర్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆశాలకు ఎగ్జామ్స్ రద్దు చేయాలి



నవతెలంగాణ - హాజీపూర్

ఆశాలకు ఎగ్జామ్స్ రద్దు చేసి, ఫిక్స్ వేతనం రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయు ఆధ్వర్యంలో గుడిపేటలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు వైద్యం అందించే దిశగా ఆశ వర్కర్స్ ప్రతి ఇంటి ఇంటికి తిరుగుతూ ప్రజలకు మందులు సకాలంలో అందిస్తున్నారన్నారు. ఆశాలు ప్రారంభం నుండి నేటి వరకు ప్రభుత్వం నిర్వహించిన అన్ని ట్రైనింగ్‌లు పూర్తి చేశారని తెలిపారు. రికార్డులు రాయడం, టెస్ట్‌లు చేయడం, ఆన్లైన్ పనులు చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. కరోనా మహమ్మారిని తరిమికొట్టే విధంగా ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారని, ఇప్పుడు ప్రభుత్వం పరీక్ష పెట్టి వాటిలో ఉత్తీర్ణత సాధిస్తేనే ఆశాలకు సర్టిఫికెట్ ఇస్తామని, లేకుంటే విధుల నుండి తొలగిస్తామని ప్రభుత్వం చెప్పడం చాలా దారుణమని తెలిపారు. ఆశాలకు నష్టం కల్గించే ఈ నిర్ణయన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలనీ డిమాండ్ చేశారు. ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సమ్మక్క,శోభ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆశాల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆశాలకు ఎగ్జామ్ రద్దు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పుష్ప, సునీత, పద్మ, సుజాత, స్వప్న, లక్ష్మి పాల్గొన్నారు.

జూన్ 9న సమీకృత కలెక్టరేట్ ప్రారంభం

నవతెలంగాణ-నస్పూర్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల (కలెక్టరేట్) భవనాన్ని జూన్ 9న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రారంభిస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ భవనాన్ని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్‌తో కలిసి సందర్శించారు. భవనంలోని జిల్లా శాఖల కార్యాలయాలు, భవన ప్రాంగణం, గార్డెనింగ్ తదితర పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు ఒకే చోట అందించానే ఉద్దేశంతో చేపట్టిన సమీకృత కలెక్టరేట్ ద్వారా ప్రజలకు సేవలు సులభతరం, వేగవంతం అవుతాయని తెలిపారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు నుండి 1658 కోట్ల రూపాయలతో చెన్నూర్ నియోజకవర్గంలోని దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందించే చెన్నూర్ ఎత్తిపోతల పథకం పనులకు శంఖుస్థాపన చేస్తారని, మందమర్రి మండలంలో సుమారు 500 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తారని తెలిపారు. మంచిర్యాల అంతర్గాం మధ్య గోదావరి నదిపై 164 కోట్లతో నిర్మించే వంతెన పనులతో పాటు వైద్య కళాశాల, ఆసుపత్రి పనులకు శంఖుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం లక్ష పైచిలుకు మందితో ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగకు హాజరై 2వ విడత గొర్రెల పంపిణీ, కుల వృత్తులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం, ఇండ్ల పట్టాల పంపిణీ పథకాలను ప్రకటించనున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించి 9సంవత్సరాలు పూర్తి చేసుకొని 10వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ప్రజలందరు సమిష్టిగా కలిసివచ్చి విజయవంతం చేయాలని తెలిపారు.

11వ వేజ్‌బోర్డులో నష్టదాయక ఒప్పందం



నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా వర్క్‌షాపులో సోమవారం ఫిట్ సెక్రటరీ కందుల తిరుపతి అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌లో బెల్లంపల్లి ఏరియా టీబీజీకేయస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు మాట్లాడారు. 11వ వేజ్‌బోర్డులో సింగరేణి కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేయకుండా నష్టం జరిగే విధంగా జాతీయ సంఘాలు ఒప్పందం చేసుకోవడం కార్మికులకు నష్టదాయకమన్నారు. జాతీయ సంఘాలు ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్ తప్పుడు ఒప్పందాలు చేసుకొని కార్మికులను మభ్యపెట్టే విధంగా గొప్పలు చెప్పుకొని తిరుగుతున్నారన్నారు. దీన్ని బెల్లంపల్లి టీబీజీకేయస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్మికులకు ఇంటి అద్దె పెంచలేదని, ఇంక్రిమెంట్ రేటు పెరగలేదని పేర్కొన్నారు. ముఖ్యంగా కార్మికులకు బేసిక్ పెరుగుదల, ఇంక్రిమెంట్ రేటు పెరుగుదల కూడా తక్కువగా ఉందన్నారు. అలవెన్సులను రెండు సంవత్సరాలు దాటిన తర్వాత ఒప్పందం చేసుకొని కార్మికులకు అన్యాయం చేయడమే కాకుండా 25 శాతం పెంచామని గొప్పలు చెప్పుకుంటున్నారని తెలిపారు. అలవెన్సులను పాత బేస్ నుండి కాకుండా జూన్ 2023 నుండి చెల్లించే విధంగా ఒప్పందం చేసుకోకపోవడం కార్మికులకు నష్టదాయకమన్నారు. కార్మికులు విహారయాత్రలకు వెళ్లి హెల్‌టీసీలను కూడా అతితక్కువ పెంచి కాంట్రాక్టు కార్మికులకు లాభదాయక ఒప్పందం చేసుకోలేదన్నారు. కార్మికులు జాతీయ సంఘాలు చేసే అవాస్తవ ప్రచారాన్ని అడ్డుకోవాలని, వాస్తవాన్ని గ్రహించాలని ఆయన కోరారు. అలాగే ఏరియా వర్క్‌షాప్ డీపీఏ ఓసీటు, ఏరియా స్టోర్ కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకొని ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ ప్రకాష్‌రావు, కార్పొరేట్ 11 మేన్ కమిటీ మెంబర్ బి మంగీలాల్, టీబీజీకేయస్ మాజీ ఉపాధ్యక్షుడు సదాశివ్, డీపీఏ ఓసీటు ఫిట్ సెక్రటరీ బూదర్ శ్రీనివాస్, ఏరియా స్టోర్ ఫిట్ సెక్రటరీ రమేష్, క్లస్టర్ కమిటీ మెంబర్ సమ్మయ్య, ఏరియా అసిస్టెంట్ కార్యదర్శి కుమారస్వామి, సంపత్‌రావు, ఏరియా నాయకులు రాజేశం, ఎం వెంకటేశం, ఏరియా వర్క్‌షాపు డీపీఏ ఓపీటు, ఏరియా స్టోర్ టీబీజీకేయస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసీ బిడ్డలను మోసగించొద్దు

- ఎంపీ సోయం బాపురావు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదివాసీ బిడ్డలను మోసగించి, మత మార్పిడి చేసేందుకు యత్నిస్తే వారికి తగిన రీతిలో బుద్ధి చెబుతామని, బుల్లెట్లు దించుతాం ఖబడ్దార్ బిడ్డా అంటూ ఎంపీ సోయం బాపురావు ఘాటుగా హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో జనజాతి సురక్ష మంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డి-లిస్టింగ్ సభకు ఎంపీతో పాటు మహారాష్ట్రకు చెందిన ఎమ్మెల్యేలు కేరం భీంరావు, సందీప్ దుర్వే, జనజాతి సురక్షామంచ్ జాతీయ, రాష్ట్రస్థాయి ప్రతినిధులు, తెలంగాణలోని వివిధ జిల్లాల నుండి ఆదివాసీలు భారీగా తరలివచ్చారు. అంతకుముందు మతం మారిన ఆదివాసీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని డిమాండ్‌తో ఆదిలాబాద్ పట్టణంలో గిరిజన సాంస్కృతిక పరిరక్షణ పేరుతో భారీగా ర్యాలీ చేపట్టారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం జరిగిన ఈ ర్యాలీలో పెప్రే, కాలికోం, బూర, డోలు వాయిద్యాలు, ఆదివాసీల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం సభ ప్రాంగణానికి చేరుకుని ఆదివాసీల ఆరాధ్యదైవాలు, పోరాట యోధుల చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలన చేసి సభను ఆరంభించారు. మతం మారిన ఆదివాసీలను ఎస్టీ జాబితా నుండి తొలగించి వారికి వర్తించే రిజర్వేషన్లను రద్దు చేయాలని వక్తలు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 12 మంది మతం మారినట్టుగా తెలుస్తోందన్నారు. వీరి మూలంగా అసలైన ఆదివాసీ బిడ్డలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి పరిణామాలకు అడ్డుకట్ట వేసేందుకు, ఆదివాసీ గిరిజనుల హక్కులు, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకునేందుకు ఈ సభను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

అవినీతి రహిత పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం

- డీసీసీ అధ్యక్షురాలు కోక్కిరాల సురేఖ



నవతెలంగాణ-దండేపల్లి

బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి పాలనతో ప్రజలు విసుగు చెందారని, అవినీతి రహిత పాలన కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. సోమవారం గడపగడపకు పిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెల్కగూడ పంచాయతీ పరిధిలోని ఇప్పలగూడెంలో పర్యటించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి పాలనను ప్రజలకు వివరిస్తూ కొక్కిరాల రఘుపతిరావు టెస్టు ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. తాము అధికారంలో లేకపోయినా పది సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, తమకు ఒక అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం

నవతెలంగాణ-తాండూర్

కాసిపేట బీరన్న గుడి వద్ద బోర్‌వెల్ పనులను ఎంపీపీ పూసల ప్రణయ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. రూ.2లక్షల నిధులతో మంజూరైన బోర్‌వెల్‌ను కాసిపేట గ్రామ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, సర్పంచ్, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణ బీజేపీ కార్యవర్గ సమావేశాన్ని సోమవారం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు మహంకాళి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి, చెన్నూర్ నియోజకవర్గ బాధ్యులు అందుగుల శ్రీనివాస్, కన్వీనర్లు అక్కల రమేష్ హాజరై మాట్లాడారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఆసిఫాబాద్ టు శ్రీరాంపూర్ వరకు చేపట్టిన పనులు రెండు సంవత్సరాలలోనే 90శాతం పూర్తయ్యాయని, నరేంద్ర మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులు 9సంవత్సరాలు అయినప్పటికీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నిర్లక్ష్యం మూలంగా పనులు పూర్తికాక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ మున్సిపల్ సమస్యలు పరిష్కరించకుండా, అభివృద్ధి పనులను చేపట్టకుండా ఉంటున్నారని తెలిపారు. ఇంటి పన్నులు 100 శాతం వసూలు మీద ఉన్న దృష్టి అభివృద్ధి మీద చూపడం లేదని తెలిపారు. ఎమ్మెల్యే సుమన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని పోరాటం చేసిన బిజెపి నాయకులపై అక్రమ కేసులు, అక్రమ అరెస్టులు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వేల్పుల సత్యనారాయణ, సీనియర్ నాయకులు వేముల అశోక్, దండు రాజేందర్, వెంకటేష్, పట్టణ ఉపాధ్యక్షులు సంగారవి, మల్లయ్య, మహిళా మోర్చా అధ్యక్షురాలు మేదరి లక్ష్మి, పట్టణ బిసి మోర్చా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వీరమల్ల పాలరాజయ్య, సాటపురి శివ, ఎస్సీ మోర్చా అధ్యక్షులు బంగారి ప్రసాద్, బీజెవైఎం ప్రధాన కార్యదర్శి సాయి, కిషన్ పాల్గొన్నారు.

4న చలో కొత్తగూడెంకు తరలిరండి

నవతెలంగాణ - రెబ్బెన

విద్య, ఉపాధి హక్కుల సాధనకు జూన్ 4న నిర్వహించే చలో కొత్తగూడెం కార్యక్రమానికి విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు బాలునాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కొత్తగూడెంలో నిర్వహించే బహిరంగసభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

శతాధిక వృద్ధుడు మృతి

నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలోని నదీమాబాద్‌కు చెందిన ఉప్పుల పిక్కయ్య(110) సోమవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడి వయసు 110 సంవత్సరాలు ఉంటుంది.

ఘనంగా టీపీటీఎఫ్ అవతరణ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ - జైనూర్

టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా శాఖ తరపున మండలంలోని మార్లావాయి గ్రామంలో టీపీటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కనక వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ టీపీటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఎళ్లవేళల ఉపాధ్యాయుల పక్షాన ఉండి పోరాటం చేస్తుందన్నారు. సామాజిక సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక ఉపాధ్యాయ సంఘం టీపీటీఎఫ్ అని పేర్కొన్నారు. కోర్టులో ఉన్న న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి తక్షణమే బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఉద్యోగస్తులకు గుదిబండగా మారిన సీపీఎస్‌ను తక్షణమే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మండడి సోనేరావ్, ఆడ సెడ్మారావ్, కనక సోనేరావ్, ఆత్రం జల్పత్‌రావ్, పి.కమల, మహేశ్వరి, ఇంద్రు, శ్యామ్‌రావ్, హేమలత, పరమేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం కప్‌లో గోల్డ్ మెడల్

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన కొత్తూరు ప్రణయ్ జిల్లా తరపున హైదరాబాద్‌లో జరుగుతున్న సీఎం కప్ పోటీల్లో పాల్గొన్నాడు. లాంగ్ జంప్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. గోల్డ్ మెడల్ సాధించిన ప్రణయ్‌ను పలువురు అభినందించారు. ఎంపీపీ మంత్రి సురేఖ, ఎంపిడిఓ భాస్కర్ మెడల్ సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతంలోని వజ్రాలను వెతికి తీయడమే సీఎం కప్ ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొన్నారు.

ఆశాలకు పరీక్షలు నిర్వహిస్తామనడం సరికాదు

నవతెలంగాణ-నిర్మల్



ఆశాలకు పరీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సరికాదని ఆశావర్కర్లు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆశాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఆశాలకు పనిభారం తగ్గించి, జాబ్‌చార్ట్‌ను విడుదల చేయాలని అన్నారు. ఆశాలకు రూ.18వేల నిర్ణిత వేతనం చెల్లించాలని కోరారు. ఇందులో ఆశావర్కర్లు గంగామణి, చంద్రకళ, రామలక్ష్మి, సునీత, వనమాల, గంగాలక్ష్మి, మంజుల, శ్రీదేవి, లత, సుజాత ఉన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలంగాణ దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 30 మే 2023

రేవంత్‌రెడ్డిని కలిసిన ఆడే గజేందర్

నవతెలంగాణ-బోథ్



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో బోథ్ నియోజకవర్గ నాయకుడు ఆడే గజేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ చేపడుతున్న పలు కార్యక్రమాలను గురించి చర్చించారు. అలాగే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తరపున మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రజల తరపున ముందుండి ప్రభుత్వంతో పోరాటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని అన్నారు.

అధికారులు లేక బోసిపోయిన ప్రజావాణి

- సమయమైన స్వీకరించని అర్జీలు
- బయట అర్జీదారుల పడిగాపులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి విభాగంలో అధికారులు లేక వెలవెలబోయింది. ప్రతి సోమవారం అర్జీదారులు తమ సమస్యలను విన్నవించడానికి నిర్వహించే ఈ కార్యక్రమం కాగా ఆయా సంబంధితశాఖ అధికారులు, అలాగే అర్జీలు స్వీకరించే కలెక్టర్ అదనపు కలెక్టర్‌లు అధికారులు ఉదయం 11.30 గంటల సమయం దాటినప్పటికి ఎవరు రాలేదు. దీంతో బయట అర్జీదారులు బయట పడిగాపులుగా ఉన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ నటరాజ్ అర్జీలు స్వీకరించడం ప్రారంభించారు. అప్పటి వరకు అర్జీదారులు బయట పడిగాపులు కాచారు. ఆయా సంబంధిత శాఖ పలువురు అధికారులు గైర్హాజరయ్యారు.

'ప్రేమతో నాన్న' షార్ట్ ఫిలిం ప్రారంభం

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ వేణు గోపాలకృష్ణ కథ, మాటలు, నిర్వహణ బాధ్యలతో డాక్టర్ నీలిమ నిర్మిస్తున్న షార్ట్ ఫిలిమ్ డాక్యుమెంటరీ ప్రేమతో నాన్న సోమవారం ప్రారంభమైంది. నిర్మల్ జిల్లాకేంద్రంలోని మల్లన్న గుట్ట, హరిహర క్షేత్రంలో షూటింగ్ నిర్వహిస్తున్నారు. ఒక తండ్రి కథ, కుటుంబ విలువలు, పిల్లల పెంపకం, సమాజ పాత్ర, పిల్లలతో తల్లితండ్రుల అనుబంధం లాంటి సున్నితమైన అంశాల మీద కథనం ఉంటుందని ముఖ్య పాత్రధారి డాక్టర్ వేణుగోపాల కృష్ణ తెలిపారు.

అర్హులైన వారికి ఆసరా పింఛన్లు మంజూరు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆసరా పింఛన్ల కోసం వృద్ధులు, వితంతువులు మూడేళ్లుగా ఎదురు చూస్తున్నా ప్రభుత్వం మంజూరు చేయడం లేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి అన్నారు. సోమవారం తాంసి మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులతో జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదుల విభాగంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ 65 ఏండ్ల వయసు దాటిన వృద్ధులు, ఇంటిపెద్దను కోల్పోయి వితంతువుగా మారిన మహిళలు, ఇతర కేటగిరీల కింద దరఖాస్తు చేసిన మండలానికి చెందిన పలువురికి పింఛన్లు మంజూరు కాక వారు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మండల, పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు తీసుకుంటున్నా, జిల్లాస్థాయిలో ఆమోదం లభించడంలేదనీ అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోర్టు ఆదేశాల ప్రకారం అర్హులైన వారికి ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఏరియాల జీఎంలతో డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ పా బలరాం సమీక్షా సమావేశం

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఏరియా స్థానిక ఎల్లందు క్లబ్‌లో సోమవారం డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ పా ఎన్ బలరాం మందమర్రి, శ్రీరాంపూర్, గోలేటి, ఎస్టీపీపీ ఏరియాల జీఎంలతో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాల గురించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎన్ బలరాం మాట్లాడుతూ అన్ని సింగరేణి ఏరియాల వ్యాప్తంగా జరగబోవు తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవ సంబురాలు సింగరేణిలో జరుగుతాయని తెలిపారు. దానికి అధికారులు, ఉద్యోగులు, అన్ని యూనియన్ ప్రజా ప్రతినిధులందరూ సింగరేణి సంస్థ సాధించిన ప్రగతిని తెలుపుతూ ఘనంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు జరగబోవు మందమర్రి ఏరియాలోని స్థానిక సింగరేణి హై స్కూల్ మైదానాన్ని మందమర్రి ఏరియా ఉన్నతాధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి, శ్రీరాంపూర్, గోలేటి, ఎస్టీపీపీ, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

ఎంఐఎం నాయకులతో కలిసి కుట్రలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



శాంతియుతంగా ఉన్న ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే జోగు రామన్న ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ సాయంతో ఆదిలాబాద్ ప్రజల్లో కల్మషాలను సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ ఆరోపించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జోగు రామన్న తన గ్రాఫ్ పడిపోవడం చూసి భయపడి ఎంఐఎం నాయకులతో కలిసి కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఆదిలాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో హిందూ దేవాలయాలకు నిధులివ్వడంపై చేసిన కామెంట్లు హాస్యాస్పదం అన్నారు. రాష్ట్ర ఖజానాకు భారీ మొత్తంలో నిధులు వస్తుంది హిందూ దేవాలయాల నుండి, లక్షల కోట్ల రూపాయలు టాక్స్‌ల రూపంలో కడుతుంది హిందువులేనని అన్నారు. బస్సులో హిందు మహిళ చంటి పిల్లాడికి పాలు పట్టాలి కొంచం కూర్చోడానికి సీటు ఇవ్వమ్మ అని అడిగిన సందర్భంలో జరిగిన చిన్న వివాదాన్ని తన భర్తను సస్పెండ్ చేయించే కుట్రలో అసదుద్దీన్ సూత్రధారి, ఆదిలాబాద్‌లో యువకుడిపై దాడి చేసి చిత్రహింసలు పెట్టి, పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన వారికి వత్తాసు పలకడం బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల అక్రమ సంబంధానికి నిదర్శనమని అన్నారు. హిందు దేవాలయాలపై వాటి నిర్వహణ వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అసదుద్దీన్‌పై దేవాదాయ శాఖామంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడాలని అన్నారు. అసదుద్దీన్ వ్యాఖ్యలను ఖండించాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌లో మాకు ఇన్నివేల ఓట్లున్నాయి మేము ఎన్నికలను ప్రభావితం చేసే స్థాయిలో నేడు ముస్లింలు ఉన్నారని అన్నాడు. హిందూబంధువులారా లక్షా తొంభై వేల ఓట్లు మనవి ఉన్నాయి. మన సత్తా ఏంటో చూపిద్దామని అన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు ఆదినాథ్, దినేష్ మటోలియ, రాజేష్, నగేష్‌రెడ్డి, అశోక్, ముకుంద్ నరేష్, నాందేవ్, రాజేష్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జిల్లాలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దశాబ్ది ఉత్సవ వేడుకల నిర్వహణపై వివిధ శాఖల జిల్లా అధికారులతో, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవ వేడుకల నిర్వహణలో రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రైతు దినోత్సవం, చెరువుల పండుగ, విద్యుత్ దినోత్సవ కార్యక్రమాలకు ప్రత్యేక అధికారులను నియమించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని 101 రైతువేదికలను, సబ్ స్టేషన్‌లను, ప్రభుత్వ కార్యాలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించాలని అన్నారు. నియోజక వర్గ స్థాయిలో జరిగే సాగు నీటి దినోత్సవం, విద్యుత్ విజయోత్సవం, సంక్షేమ సంబురాలు వంటి కార్యక్రమాలలో వెయ్యి మందికి పైగా ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సురక్ష దినోత్సవం, తెలంగాణ రన్ వంటి కార్యక్రమాలలో శాంతి భద్రతల రక్షణ, సేవలను తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో నిర్వహించే వివిధ కార్యక్రమాల వేదికలు, నిర్వహణ వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులు నివేదికలు అందజేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు 21 రోజుల పాటు నిర్వహించే దశాబ్ది వేడుకలకు ప్రింట్, ఎలక్ట్రానిక్, ఆకాశవాణి, వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించి, కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ చైర్మెన్ రాథోడ్ జనార్దన్ మాట్లాడుతూ జిల్లాలో జూన్-2 నుండి 22 వరకు నిర్వహించే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవ వేడుకలకు ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పండగ వాతావరణంలో నిర్వహించేలా ఘనంగా ఏర్పాట్లు చేయాలనీ సూచించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ ఎందరో అమరవీరుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు. అందుకు ప్రభుత్వం రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను 21 రోజులపాటు ఘనంగా కార్యక్రమాల నిర్వహిస్తుందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆసరా ఫించన్లు, రైతు బంధు, రైతు బీమా, దళిత బంధు, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు పరచడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, జిల్లా అటవీ అధికారి రాజశేఖర్, శిక్షణ సహాయ కలెక్టర్లు శ్రీజ, వికాస్ మోహతో, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మనోహర్, ఆర్డీఓలు రమేష్ రాథోడ్, కదం సురేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డోంగ్రె రేవయ్యను యువత ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ- రెబ్బెన

మండలంలోని తుంగెడ గ్రామానికి చెందిన సివిల్ ర్యాంకర్ డోంగ్రె రేవయ్యను జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి ఘనంగా సన్మానించారు. సోమవారం తుంగెడ గ్రామానికి వచ్చిన ఆమె సివిల్స్‌లో 410వ ర్యాంకు సాధించిన రేవయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ యూపీఎస్సీ ఫలితాల్లో 410 ర్యాంకు సాధించి జిల్లా నుండి ఎంపికకావడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. బాల్యం నుండి ఎన్నో కష్టాలను ఎదుర్కొని, ఉన్నత విద్యనభ్యసించి రేవయ్య విజయం సాధించినందుకు హర్షం వ్యక్తం చేశారు. నేటి యువత రేవయ్యను ఆదర్శంగా తీసుకొని ఉన్నతమైన లక్ష్యాలతో ముందుకెళ్లాలని ఆమె కోరారు. విజయానికి పేదరికం అడ్డుకాదని నిరుపించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మి సౌందర్య ఆనంద్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సర్పంచ్‌లు సోమశేఖర్, మధునయ్య, పోచమల్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హరీష్‌బాబు సన్మానం

సివిల్స్‌లో ర్యాంక్ సాధించిన తుంగెడ గ్రామానికి చెందిన డోంగ్రి రేవయ్యను బీజేపీ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హరీష్‌బాబు మాట్లాడుతూ మారుమూల గ్రామమైన తుంగెడకు చెందిన యువకుడు ఐఏఎస్‌కు ఎంపిక కావడం మన ప్రాంతానికి ఎంతో గర్వకారణమన్నారు. 2009 వరకు తుంగెడ గ్రామం సిర్పూర్ నియోజకవర్గ పరిధిలో ఉన్నందున ఈ గ్రామస్తులతో పాల్వాయి పురుషోత్తంరావు, పాల్వాయి రాజ్యలక్ష్మికి గొప్ప అనుబంధం ఉందన్నారు. ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు వారి ఆధ్వర్యంలోనే జరిగాయని తెలిపారు. డోంగ్రి రేవయ్య



తెలంగాణ క్యాడర్‌కు ఎంపికై మన ప్రాంతానికి సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డోంగ్రి కార్తీక్, తిరుపతి, మాజీ సర్పంచ్ రాంచందర్, సర్పంచ్ డోంగ్రి పెంటయ్య, మల్లయ్య, కిశోర్ పాల్గొన్నారు.

మహర్ రాష్ట్ర అధ్యక్షుని సన్మానం

సివిల్ సర్వీసెస్‌లో 410వ ర్యాంకు సాధించిన డోంగ్రి రేవయ్యను మహర్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి దీపక్ ఘనంగా సన్మానించారు. జిల్లాతో పాటు తుంగెడ గ్రామానికి చిరస్మరణీయమైన పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చినందుకు రేవయ్యకు అభినందనలు తెలిపారు.

దళితుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యేల జోగు రామన్న
- మాదిగ సంక్షేమ సంఘ స్థలానికి భూమిపూజ
- జిల్లా వ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చిన మాదిగలు
- డప్పుచప్పుళ్లతో హోరెత్తిన జూబ్లీహిల్స్ ప్రాంతం



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

దళితుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని సర్వే నెం.72లోని జూబ్లీహిల్స్ కాలనీలో మాదిగ సంక్షేమ సంఘ స్థలం భూమిపూజ కార్యక్రమాన్ని సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు మైసమ్మ విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం డా.బీ.ఆర్.అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. డప్పు వాయించి అక్కడి వారిని ఉత్సాహపరిచారు.అంతకుముందు ఎమ్మెల్యేను సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. బహుజనులకు అండగా నిలుస్తూ వారి అభ్యున్నతి కోసం కులాలు, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరి ఆకాంక్షలను నిజం చేసేలా శక్తి వంచన లేకుండా కృషిచేస్తున్నామని తెలిపారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మాదిగ సంక్షేమ సంఘానికి స్థలం కేటాయించామని.. ఇక్కడ అవసరమైన భవనాల కోసం త్వరలోనే రూ.2కోట్లు మంజూరుచేయిస్తామని భరోసా ఇచ్చారు. మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మరిన్ని నిధులు కేటాయిస్తామని చెప్పారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని పిల్లలను ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ స్థలంలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని హామీనిచ్చారు. కులాల జనాభా ఆధారంగా దళితబంధు అందజేస్తామని వివరించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించకుండా దళితుల సంక్షేమం కోసమే వెచ్చిస్తోందని చెప్పారు.

డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం..!

మాదిగ సంక్షేమ సంఘం స్థలం భూమిపూజకు హాజరైన ఎమ్మెల్యే జోగు రామన్నకు సంక్షేమ సంఘం నాయకులు, మాదిగలు ఘన స్వాగతం పలికారు. న్యూహౌసింగ్‌బోర్డు కాలనీలోని వివేకానంద చౌరస్తా నుంచి జూబ్లీహిల్స్ వరకు డప్పుచప్పులు, డీజే పాటలు, టపాసుల మోత మధ్య ఘన స్వాగతం పలికారు. వివిధ గ్రామాల నుంచి జనాలు డప్పులతో రావడం..దారిపొడవునా డప్పుచప్పుళ్లతో ఆ ప్రాంతమంతా హోరెత్తిపోయింది. వివిధ గ్రామాల నుంచి మాదిగలు బస్సులు, ఇతర వాహనాల్లో వందలాదిగా తరలివచ్చారు. ఎండల దృష్ట్యా ఎవరికి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు కూలర్లు, తాగునీరు, భోజనం తదితర సౌకర్యాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చందాల రాజన్న, గాలిపెల్లి నాగన్న, గౌరవ అధ్యక్షుడు అలాల అజయ్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఇజ్జగిరి సంజయ్, ఈర్ల దయాకర్, నాయకులు నవీన్, ఏవన్, మల్యాల మనోజ్, నక్క రాందాస్, బిక్కి గంగాధర్, ఆరెల్లి మల్లేష్, రొడ్డ సాగర్, బట్టు సంతోష్, కడదరపు అశోక్, దర్శనాల లక్ష్మణ్, ఇజ్జగిరి అశోక్, చందాల ఈశ్వరి, కడదరపు దేవిదాస్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇండ్ల జాగా ఇచ్చేదాక ఈంచు కదిలేది లేదు

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ మండలంలోని బావురావుపేట్ శివారు ప్రభుత్వ భూమిని ఇంటి స్థలాల కోసం కేటాయించాలని డిమాండ్ చేస్తూ గత 30 రోజుల నుండి పేద కుటుంబాలకు చెందిన మహిళలు చేస్తున్న పోరాటానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొప్పని పద్మ మద్దతు తెలిపారు. సోమవారం బావురావుపేట్ శివారు ప్రభుత్వ భూములను సందర్శించిన ఆమె ఎర్ర జెండా నీడలో ఎన్నో విజయాలు సాధించుకున్నామని అన్నారు. బావురావుపేట్ శివారులో చేస్తున్న పోరాటంతో ప్రభుత్వ పెద్దలు దిగిరావాలని, పేదలు కోరినట్లు ఇక్కడ ఇండ్ల జాగ ఇచ్చే వరకు ఇంచు కూడా కదిలేదిన లేదని అన్నారు. ఇండ్ల స్థలాల కోసం పోరాడుతున్న పేద కుటుంబాల వారి పట్ల ప్రజా ప్రతినిదులు, ప్రభుత్వ పెద్దలు కలుగజేసుకోవాలని అసైన్‌మెంట్, సీలింగ్, ప్రభుత్వ భూములను కాపాడాలని, బాధ్యతగా వ్యవహరించి ఇంటి స్థలాలు పంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ భూములు ధనవంతుల చేతుల్లో చిక్కుకున్నాయని అన్నారు. ప్రభుత్వ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ పోరాటం చేస్తున్న వారిని బెదిరింపులకు గురి చేస్తుండటంతో పాటు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తుండటం బాధాకరమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో భూపోరాటాలు చేస్తున్నారని ఎర్ర జెండాతో పోరాటం చేసి విజయం సాధించిన చరిత్రను గుర్తు చేసుకోవాలని అన్నారు. పేదలంతా ఐక్యంగా పోరాడితే ఏదైనా సాధించగలమని అన్నారు. చాకలి ఐలమ్మ స్పూర్తితో పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని



అన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదని తక్షణమే అధికారులు స్పందించి ఇక్కడి ప్రభుత్వ భూమిని పేదలకు ఇంటి స్థలాలుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి రాజేశ్వరి, జిల్లా పార్టీ కమిటి సభ్యులు బోడంకి చందు, పట్టణ కార్యదర్శి ఎండీ ఆవేజ్, ఇండ్ల స్థలాల పోరాట కమిటి సభ్యులు మానక్క, రేణుక, ఉమారాణి, పోసక్క, సంధ్య, సరిత, అంజలి, నవీన్, పవన, సుధ, రాజేశ్వరి, ప్రసన్న, మౌనిక, కిరన్మయి, సమక్క, లక్ష్మి పాల్గొన్నారు.

పోలీసుల గౌరవం మరింత పెంచే విధంగా కృషి చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రజలలో పోలీసుల గౌరవం మరింత పెంచే విధంగా కృషిచేయాలని ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా పిర్యాదుల విభాగం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పిర్యాదుదారులు తమ సమస్యలను ఎస్పీకి తెలియజేసి, అర్జిలను అందజేశారు. సమస్యలను తెలుసుకొని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సామాన్య ప్రజలకు పోలీసు అండగా ఉండాలని అన్నారు. వారితో స్నేహభావంగా మేసులు కోవాలని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారిపట్ల కఠీనంగా చట్టరీత్యా చర్యలుంటాయని అన్నారు. పోలీసుల సహాయం కావాలనుకున్నా వారు పోలీసు స్టేషన్‌లో నిర్భయంగా ఫిర్యాదు చేసుకోవాలని తెలిపారు. అనుమాస్పదన వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని దృష్టికి వస్తే వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేయాలని సూచించారు. లేదా జిల్లా వాట్సప్ నంబర్ 8712659599కు సమాచారం తెలియజేయాలని కోరారు.

కాంట్రాక్ట్ నర్సుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-బోథ్

జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల్లో, సీహెచ్‌సీలో, పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని డీఎంఈ కార్యాలయంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సంచాలకులు జి.శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పసుల చంటి మాట్లాడుతూ స్టాఫ్ నర్సులను యధా స్థానాల్లో పోస్టింగ్ ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే ఎంప్లాయ్ ఐడి ఇవ్వాలని అన్నారు. ఏడు నెలల పెండింగ్ వేతనాలు అందించాలని నేషనల్ హెల్త్ మిషన్‌లో ఇచ్చిన పోస్టులకు అప్రూవల్ చేసి ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా వైద్యారోగ్యశాఖ సంచాలకులు జి.శ్రీనివాసరావు స్పందిస్తూ వారం రోజుల్లో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలియజేశారు. అనంతరం నేషనల్ హెల్త్ మిషన్ కమిషనర్‌ను, వైద్యారోగ్యశాఖ సెక్రటరీ సచివాలయంలో కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఈ కార్యక్రమంలో బోథ్ స్టాఫ్ నర్సులు సోయం నాగేందర్, అశ్విత, ఉమలత, లక్ష్మి,, హైమవతి పాల్గొన్నారు.

సీడీపీఓ, సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్ల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీ టీచర్‌ని మానసిక వేధింపులకు గురిచేసిన జైనథ్ ప్రాజెక్టు సీడీపీఓ, సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ నటరాజన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షురాలు రాధా మాట్లాడుతూ జైనథ్ మండలం పూసాయి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ రికార్డులు రాయడం లేదని ఆరోపించడంతో పాటు టీచర్‌కు సంబంధంలేని ఆయా డ్యూటీలు సైతం వంట చేయలేదని, అంగన్‌వాడి శుభ్రంగా లేదంటూ టీచర్‌ను వేధించడంతో ఆమె అంగన్‌వాడీ ఉద్యోగానికి రాజీనామా చేసిందని అన్నారు. అయినప్పటికీ వేధింపులు తగ్గకపోవడంతో గ్రామాన్ని వదిలి వెళ్లిపోయే పరిస్థితి తెచ్చిందని దీనంతటికీ కారణమైన సూపర్‌వైజర్, సీడీపీఓలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో అంగన్‌వాడీ టీచర్లు సునంద, నర్సమ్మ, వసంత పాల్గొన్నారు.

గురుకులంలో సీటు సాధించిన విద్యార్థులు

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని పాతఎల్లాపూర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు గురుకుల పాఠశాలలో సీటు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్తి మారుతీస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాతఎల్లాపూర్‌కు చెందిన తోటపల్లి నిశిత, రామడుగు ప్రణీతలు గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో సీటు సాధించారని తెలిపారు. పాఠశాల నుండి గురుకుల ప్రవేశ పరీక్షలో మంచి మార్కులు సాధించారని, వీరిని ఉపాధ్యాయులు కిషన్, సర్పంచ్ అంబటి స్వప్న చంద్రయ్య, బొద్దుల ప్రేమలత అభినందించినట్టు తెలిపారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని, దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో దివ్యాంగులు ఆందోళనబాట పట్టారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రధానంగా నూతన వికలాంగుల కాలనీ ఏర్పాటు చేయాలని, ఎటువంటి షరతులు లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్ మంజూరు చేయాలని ఎన్‌పీఆర్‌డీ అధ్యక్షులు ఎండి. ఇమ్రాన్ అన్నారు. అలాగే పట్టణంలో నూతనంగా నిర్మించిన పురపాలక సంఘం భవనంలో ర్యాంపు ఏర్పాటు చేయాలని అన్నారు. జీఓ నెంబర్ 30ను ప్రతి ప్రభుత్వ ఆఫీసులో తక్షణమే అమలు చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా వికలాంగుల కమ్యూనిటీ హాలును వెంటనే పూర్తి చేయాలన్నారు. లేనిపక్షంలో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

అంబేద్కర్ భవనం నిర్మించి ఇవ్వాలి

నవతెలంగాణ-జైపూర్

పెగడపల్లి గ్రామంలో అంబేద్కర్ భవనం నిర్మించి ఇవ్వాలని గ్రామానికి చెందిన అంబేద్కర్ యువజన సేవా కమిటీ సభ్యులు సోమవారం ప్రజావాణిలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో పలుమార్లు ప్రజా ప్రతినిదులను, ప్రభుత్వ పెద్దలను కలిసి పెగడపల్లి గ్రామంలో అంబేద్కర్ భవనం నిర్మించాలని కోరినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో గంగాదరి మల్లేష్, ఎనగందుల మల్లేష్, గంగాదరి మధు, ఎనగందుల రవితేజ, రామగిరి పాపయ్య, నాగరాజు, ఆత్మారి కిరన్, మోతె సాయి కిరన్, గంగాదరి మల్లేష్, ఎనగందుల రవి ఉన్నారు.